ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024

పంచ వైష్ణవ క్షేత్ర దర్శినికి బస్సుల ఏర్పాటు

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో పంచవైష్ణవ క్షేత్రదర్శిని కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ నెల 7, 14, 21వ తేదీల్లో శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయి. ద్వారకాతిరుమల(వెంకటేశ్వరస్వామి), అంతర్వేది(లక్ష్మీనరసింహస్వామి), అప్పన్నతల్లి(శ్రీబాలబాలాజీ), గొట్లల మామిడాడ (కోదండరామాలయం), అన్నవరం(సత్యనారాయణ) ఆలయాల దర్శనం తర్వాత మళ్లీ శ్రీకాకుళం చేరుకుంటాయి. ఒక్కో టికెట్ ధర రూ.2,150 చొప్పున నిర్ణయించామ'ని తెలిపారు.

హైవేపై శోకం



ప్రమాద ఘటన ఊహా చిత్రం

కారు వద్ద మృతదేహాలు



కారును క్రేన్ సాయంతో పక్కకు తొలగిస్తున్న పోలీసులు

మేనమామను తీసుకుని వచ్చేందుకు ఒకరు.. భార్యకు బ్యాంకు పరీక్ష ఉండడంతో బయల్దేరిన దంపతులు.. వీరిని కారులో తీసుకుని డ్రైవింగ్ చేస్తూ మరొకరు..! దాదాపు నలభై నిమిషాలు గడిచింది. రోడ్డుపై చిన్నగా పారుతున్న వర్షపునీరు అడ్డొస్తోంది. అయితే త్వరగా గమ్యం చేరాలన్న ఆత్రుత..! కారు డ్రైవరు వేగం పెంచాడు. అంతే.. క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. జాతీయ రహదారి రక్తమోడింది. నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. కారు నుజ్జునుజ్జయి.. అందులోనే మృతదేహాలు ఇరుక్కుని.. భీతావహంగా కనిపించింది ఆప్రాంతం. కారు డివైడర్‌ను తాకి టైరు పంక్చరై.. డివైడర్‌పైకి ఎక్కి.. జాతీయరహదారిపై అటువైపునకు పోయి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపాన హైవేపై శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన గౌడి వెంకటరమణ కౌశిక్ (27), మెడి జయేశ్(20), వడ్డి మణిబాల(24), వడ్డి అభినవ్(27) దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్ రాజ్‌ఖాన్‌కు తీవ్రగాయాలయ్యాయి.

- అతివేగం.. వర్షపునీరు.. క్షణాల్లో దారుణం
- టైరు పంక్చరై డివైడర్‌ను ఢీకొట్టి ఆవలివైపునకు..
- ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు
- 30 అడుగులు ఈడ్చుకుని పోయి ఆగిన లారీ
- కారులోనే.. అక్కడికక్కడే నలుగురి మృతి
- అందరూ శ్రీకాకుళం నగర వాసులే..
- భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఘటన
- మృతుల్లో దంపతులు.. వీరికి రెండేళ్ల కొడుకు



గౌడి కౌశిక్ (ఫైల్)



వడ్డి అభినవ్, భార్య మణిమాల (ఫైల్)



కారు డ్రైవర్ జయేశ్ (ఫైల్)

శ్రీకాకుళం/భోగాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళం నగరానికి చెందిన లంక బావాజీనాయుడు మనవడికి డిసెంబరు 6న వివాహం జరగనుంది. ఈ పెళ్లికి హాజరయ్యేందుకు అమెరికాలో ఉంటున్న బావాజీ నాయుడు కుమారుడు బాలాజీ శనివారం విమానంలో విశాఖపట్నం వస్తున్నారు. ఆయనకు స్వాగతం పలికి శ్రీకాకుళం తీసుకువచ్చేందుకు బాలాజీ మేనల్లుడు గౌడి కౌశిక్ తన ఫార్చ్యూనర్ కారులో డ్రైవర్ జయేశ్‌తో కలిసి విశాఖపట్నం బయలు దేరారు. కాగా.. కారులో విశాఖ వెళ్తున్నానని మిత్రుడు వడ్డి అభినవ్‌కు శుక్రవారమే కౌశిక్ చెప్పాడు. తన భార్యకు విశాఖలో బ్యాంకు పరీక్ష ఉందని.. తాము కూడా శనివారం కారులో వచ్చేస్తామని అభినవ్ తెలిపాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కౌశిక్, వడ్డి అభినవ్, ఆయన సతీమణి మణిమాల విశాఖ బయలుదేరారు. గమ్యం తొందరగా చేరుకోవాలని వేగంగా వెళ్తున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపానికి వచ్చాక రోడ్డుపై వర్షపునీరు (మిగతా 6వ పేజీలో..)

సీసీ కెమెరాలో నిక్షిప్తమై..

ఘటనా స్థలం సమీపంలో పెట్రోల్ బంక్ ఉంది. ఇక్కడ సీసీ కెమెరాలు అమర్చారు. ఉదయం 8 గంటలు దాటిన తర్వాత ప్రమాదం జరిగినట్లు దృశ్యాలు ఇందులో నిక్షిప్తమయ్యాయి. కారు వేగంగా రావడం.. డివైడర్‌ను ఆనుకుని వెళ్లడం.. ఆవెంటనే డివైడర్‌ను ఆవలివైపునకు వెళ్లి లారీని ఢీకొట్టడం.. కారును లారీ దాదాపు 30 అడుగుల దూరం ఈడ్చుకుని పోవడం.. ఇవన్నీ అందులో రికార్డయ్యాయి. ఈ సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.



1. డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు అవతలకు వెళ్తూ..



2. ఆవలివైపు ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టి..

ఏడాది క్రితమే వివాహం..

గౌడి కౌశిక్.. శ్రీకాకుళంలోని పేర్లవారి వీధిలో బంగార ఆభరణాల వ్యాపారాన్ని తండ్రి వాసుదేవరావుతో కలసి చూసుకుంటున్నారు. కౌశిక్ అందరితో కలివిడిగా ఉంటూ మంచిపేరు సంపాదించుకున్నారు. ఏడాది క్రితం కౌశిక్‌కు వివాహమైంది. అత్తవారు కూడా బంగారు వర్తకులే. కౌశిక్ మృతి చెందిన వార్త తెలుసుకుని ఆ రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు తాను..

కారు డ్రైవర్ మెడి జయేశ్ తండ్రి చాన్నాళ్ల కిందట ఓ ప్రమాదంలో మృతి చెందారు. అప్పటినుంచి తల్లి.. నగరంలో సున్నపువీధిలో టీస్టాల్ నిర్వహిస్తూ జయేశ్‌ను పెంచింది. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో జయేశ్ కూడా మృతి చెందడంతో ఆమె రోదన వర్ణనాతీతం

భార్య పరీక్ష కోసం తోడుగావెళ్లి..

కౌశిక్ మిత్రుడు అభినవ్. శ్రీకాకుళంలో లియో మెడికల్స్ ల్యాబ్‌ను తన తండ్రి వడ్డి మన్మథతోపాటు అభినవ్ చూసుకుంటున్నారు. భార్య మణిమాల విశాఖలో పరీక్ష రాసేందుకు వెళ్తుండటంతో స్నేహితుడి కారులో అభినవ్, తన భార్యతో కలిసి బయలుదేరారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. అభినవ్‌కు మూడేళ్ల కిందట వివాహం అయింది. వీరికి రెండేళ్ల వయసున్న కొడుకు ఉన్నాడు. దంపతులిద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు హుటా హుటిన ప్రమాద ఘటనకు చేరుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళిలో పెట్రోకెమికల్స్

- రూ.60వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు
- అభివృద్ధితోపాటు ఉపాధి కల్పనపై దృష్టి
- బెల్టుషాపులకు వేలం వేస్తే కఠిన చర్యలు : మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధితోపాటు స్థానికంగా ఉపాధి కల్పించేలా దృష్టి సారించామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి మండలంలో రూ.60వేల కోట్లతో పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శనివారం లక్కివలసలో పింఛన్లు పంపిణీ చేశారు. రూ.70లక్షల వ్యయంతో బోరుభద్ర - పాతమేఘవరం రహదారి మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. మండలంలో ఉప్పు భూములతోపాటు ఈస్టుకోస్టు పవర్‌ప్లాంటుతో ఏపీఐఐసీకి చెందిన 8వేల ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. ఈ పరిశ్రమ ఏర్పాటుతో చాలా మందికి ఉపాధి (మిగతా 6వ పేజీలో..)

ఒంటరి ఇల్లు, మహిళలే టార్గెట్

- పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు
- నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటరి ఇల్లు, మహిళలను టార్గెట్ చేస్తూ పలు చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులు పోలీసులకు చిక్కారు. వారి నుంచి రూ.33.3లక్షలు, 31 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'సరుబుజ్జిలి జంక్షన్‌లో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అదపాకకు చెందిన పిన్నింటి సంతోష్, గట్టిమ ఆనంద్, తాలాడకు చెందిన రాగోలు రాంబాబు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. ఒంటరి ఇల్లు, మహిళలే టార్గెట్‌గా చోరీలకు పాల్పడినట్టు విచారణలో తేలింది. జిల్లాలోని సరుబుజ్జిలిలో ఒకటి, ఆమదాలవలస పరిధిలో రెండు, పొందూరు పరిధిలో మూడు, జలుమూరు, నరసన్నపేట పరిధిలో రెండేసి, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, టెక్కలి స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క దొంగతనాలు (మిగతా 6వ పేజీలో..)



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



'రెడ్ రిబ్బన్' రూపంలో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రదర్శన

ఎయిడ్స్ నివారణపై ప్రదర్శన

పలాస, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని శనివారం పలాసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. 'రెడ్ రిబ్బన్' లోగో రూపంలో ప్రదర్శన నిర్వహించారు. ఎయిడ్స్ నిర్మూలనలో విద్యార్థులంతా భాగస్వామ్యం కావాలని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి కోరారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తు ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ పి.మధు, రెడ్‌రిబ్బన్ అధికారి బి.నర్సింహులు, పివి.రమణ, శ్రీనివాస పట్నాయక్, ఎం.హరిప్రసాద్, బి.కోదండరావు, రాజేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

అవగాహన లేక.. చైతన్యం కల్పించక

- జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తున్న వైనం
- నేడు ఎయిడ్స్ నివారణ దినం

8లో

ఫెంగల్.. ముంచేసింది



- నరసన్నపేట భవానీపురానికి చెందిన చిట్టి లక్ష్మీ.. 50 సెంట్ల పొలంలో వరిపంట కోత కోసి నూర్పులు చేశారు. తుఫాన్ ప్రభావంతో ధాన్యం గింజలు తడిచిపోవడంతో ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిచిన ధాన్యాన్ని నరసన్నపేట సర్వీసు రోడ్డుపై ఆరబెట్టారు. కానీ అవి వినియోగపడతాయనే ఆశ లేదని వాపోతున్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన తమకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

- తుఫాన్ ప్రభావంతో నష్టం
- తడిచి ముద్దయిన ధాన్యం
- అన్నదాతల్లో ఆందోళన

నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులు వర్షాలు కురిశాయి. పొలాల్లో వరిపనలు నీటమునిగాయి. నూర్పులు చేపట్టి కళ్లాల్లో దాచిన ధాన్యం తడిచి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట మండలంలో రెడ్డికపేట, కోమర్తి, దేవాది, మడపాం, కిళ్లాం, మాకివలస, జమ్ము, తామరాపల్లి, ఉర్లాం, సుందరాపురం, పారశెల్లి, సత్యవరం, కంబకాయి తదితర గ్రామాల్లో కోసిన వరిపైరు వర్షాలకు తడిసి ముద్దయింది. పచ్చి చేలు కుప్పలు పెట్టడంతో ధాన్యం రంగు మారుతుందని రైతులు గగ్గోలు చెందుతున్నారు. జమ్ము, భవానీపురం, కరగాం, నారాయణవలస తదితర గ్రామాల్లో కళ్లాల్లో ధాన్యం కిందకు నీరు చేరి మొక్కలు మొలిచాయి. జమ్ము గ్రామానికి చెందిన వాన గోవిందరాజు, వెలమల దాలమ్మ, కొత్తరెడ్డి రామారావు రైతులకు చెందిన 300 బస్తాలు ధాన్యం కళ్లాల్లో తడిచి దెబ్బతిన్నాయి. శనివారం ఉదయం నుంచి కాస్త తెరిపివ్వడంతో రోడ్ల మీద ధాన్యం ఆరబోశారు. అలాగే వరి కుప్పల కింద నీటిని మళ్లిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు నిబంధనలను మరింత సడలించాలని రైతులు కోరుతున్నారు.

మరిన్ని వివరాలు 6లో

- బొడ్డవలసకు చెందిన సీహెచ్ మంజూ.. ఇటీవల వరిపంట నూర్పులు చేపట్టి.. కల్లంలో ధాన్యం భద్రపరిచారు. ప్రస్తుత తుఫాన్ ప్రభావంతో సుమారు 20 బస్తాల ధాన్యం తడిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టార్పాలిన్లు కప్పినా రంగు మారతాయనే ఉద్దేశంతో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టామని తెలిపారు. వర్షాలు తగ్గితే కొన్ని గింజలు అయినా తినేందుకు పనికివస్తాయని పేర్కొన్నారు.



ఫెంగల్ గుబులు

- జిల్లా వ్యాప్తంగా వర్షం
- పొలాల్లో నిలుస్తున్న నీరు
- మునిగిన వరి చేలు
- కాపాడుకోవడానికి రైతుల కష్టాలు



ఆమదాలవలస: రామచంద్రాపురం వద్ద తడిసిన వరి పనలను తీస్తున్న రైతు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మాదిరి వర్షం పడుతోంది. పొలాల్లోకి నీరు చేరుతోంది. కొన్ని చోట్ల ఇప్పటికే వరి చేలు నీట మునిగాయి. దీంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే వరి పంటను కోసి పొలాల్లో వదిలిన రైతులు... దాన్ని కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వరిచేలను కుప్పలుగా పోసి పరదాలు కప్పుకుంటున్నారు. కానీ అంతగా ప్రయోజనం ఉండడం లేదు. కొన్నిచోట్ల నూర్పులు పూర్తయినా... ఇళ్లకు తరలించక పోవడంతో కష్టాలు తప్పడం లేదు. నూర్చిన ధాన్యంపై కళ్లాల్లోనే పరదాలు కప్పుతున్నారు. కుటుంబాలతో కలసి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గార: తోనంగి వద్ద వరి కుప్పలపై పరదాలు కప్పుతున్న రైతు



జి.సిగడాం: వరి చేనును కుప్పలు పెడుతున్న రైతులు



జి.సిగడాం: ధాన్యాన్ని గోనె సంచులకు ఎత్తి భద్రపరుచుకుంటున్న రైతులు



ఎల్ఎన్‌పేట: ఫాక్స్‌దొరపేట వద్ద వరిచేను కుప్పలపై పరదాలు



టెక్కలి: ధాన్యంపై పరదాలు కప్పిన దృశ్యం



జలుమూరు: చల్లవానిపేటలో..



పోలాకి: కోతకోసిన వరి చేనును పొలంలోనే విడిచిపెట్టిన రైతులు

వరి పంటను ఇలా కాపాడుకోండి..

నరసన్నపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పడిన వర్షాల వల్ల నష్టపోకుండా ఉండేందుకు జాగ్రత్తలను పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, ఏవో సునీతలు శనివారం తెలిపారు.

- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిసి మొలకెత్తకుండా ఉండడానికి 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలి.
- ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి, ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కళ్లాల్లో నూర్చిన ధాన్యం ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడువాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించవచ్చును.
- కోసిన, పూర్తిగా ఆరని పనలు తడిసినట్లయితే ఎకరాకు 2.5 కిలోల ఉప్పును నీటిలో కలిపి పనలపై చల్లాలి. కింద భాగంలో నీరు చేరితే ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి. నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలి.
- కోత చేయని వరిపైరు నెలవాలితే.. మొక్కలు మొలవకుండా ఉండేందుకు నీరు బయటకు తీయాలి. ఉప్పు నీరు పిచికారీ చేయాలి.

సారవకోటలో పులి

- జమచక్రం పొలాల్లో పాదముద్రలు
- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



జలుమూరు: పులి పాదముద్రలను పరిశీలిస్తున్న బీట్ అధికారి శివప్రసాద్

జలుమూరు (సారవకోట), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో గురువారం... కోటబొమ్మాళి మండలంలో శుక్రవారం సంచరించిన పులి జాడలను శనివారం సారవకోట మండలంలో కనుగొన్నారు. జమచక్రం గ్రామం వద్ద పులి సంచరించినట్లు అటవీ శాఖాధికారులు స్పష్టం చేశారు. దీంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజానీకం భయాందోళనచెందుతున్నారు. జమచక్రం గ్రామానికి చెందిన తంగి కృష్ణమూర్తి పొలాల్లో పులి పాదముద్రలు ఉన్నాయి. ఉదయం పొలానికి వెళ్లిన రైతు వీటిని చూసి సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. మహిళా పోలీసు పల్లి పార్వతి పులి పాదాల గుర్తులను చూసి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ బీటు అధికారి డి.శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అవి పులి పాద ముద్రలేనని నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదాల గుర్తులను బట్టి చోలసముద్రం, కిడిమి గ్రామాల వైపు పులి వెళ్లినట్టు చెప్పారు. ఆ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. దీంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు అప్రమత్తమై పులి నుంచి తమను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అటవీ శాఖ అధికారుల వెంట సచివాలయ మహిళా పోలీసు పల్లి పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

పులి అడుగుజాడలని..!

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత గ్రామాలైన మెట్టూరు, ఒంకులూరు, చీపురుపల్లి గ్రామాలలో శనివారం పులి అడుగు జాడలు కనిపించాయంటూ స్థానికులు ఆందోళన చెందారు. జిల్లాలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో పెద్దపెద్ద అడుగులు కనిపించడంతో ఈ ప్రాంతీయులు తోటలకు వెళ్లేందుకు కూడా భయపడ్డారు. ఒంకులూరులో ఒక పిల్లిని గుర్తు తెలియని జంతువు చంపి ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు శనివారం సాయంత్రం పాదముద్రలను పరిశీలించారు. అవి పెద్దపులి పాదముద్రలు కావని మండల అటవీ శాఖాదికారి పోలయ్య చెప్పారు. పెద్దనక్క అడుగులై ఉంటాయని చెప్పారు. ఈ పాదముద్రలు 10-11 సెంటీమీటర్లు ఉన్నాయని... పెద్దపులి పాదముద్రలు సాధారణంగా 14- 16 సెంటీమీటర్లు ఉంటాయని స్పష్టం చేశారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



జలుమూరు: పొలాల్లో పులి పాదముద్ర



వజ్రపుకొత్తూరు: గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు



మెట్లపై దీపాల కాంతులు



గిరి మెట్లపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పద్మనాభం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. ఏటా కార్తీక అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవాన్ని శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువ జాము నుంచి పద్మనాభం చేరుకున్నారు. అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి... అనంతరం మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ వెళ్లారు. సాయంత్రం వేళ రాలేమని భావించిన పలువురు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించారు. కొండపై పద్మనాభుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో దేవస్థానం ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉదయం ఐదు గంటల నుంచే అందుబాటులో ఉంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు సమయంలో కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవీ సమేత అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపారు. తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణలతో ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గరుడ వాహనంపై స్వామి వారిని నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. ప్రథమ పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు అప్పటికే మెట్లపై సిద్ధం చేసుకున్న దీపాలను వెలిగించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా మారింది. ఉత్సవం సందర్భంగా పద్మనాభం సామాజిక వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ స్టాల్‌ను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్ ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

హైవేపై ఘోరం

(ఐదో పేజీ తరువాయి)

కారణంగా డ్రైవరు కారును అదుపు చేయలేకపోయాడు. కారు డివైడర్‌ను తాకుతూ వెళ్లడంతో టైరు పంక్చర్ అయింది. క్షణాల్లో డివైడర్‌ను ఢీకొట్టి విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారిపైకి దూసుకుపోయింది. అదే సమయంలో విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీని ఢీకొట్టింది. కారును లారీ 30 అడుగుల దూరం మేర ఈడ్చుకుంటూ పోయింది. దీంతో కారు నుజ్జునుజ్జుఅయింది. కారు డోర్లు తెరుచుకుని ఇద్దరి శరీరాలు సగం వరకు బయటపడ్డాయి. మరో ఇద్దరు కారులోనే చిక్కుకున్నారు. నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే లారీ డ్రైవర్ రాజ్‌ఖాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొంత సమయం ట్రాఫిక్ ఆగిపోయింది. విజయనగరం అడిషనల్ ఎస్పీ పి.సౌమ్యలత, సీఐ ఎస్వీ ప్రభాకర్, ఎస్‌ఐలు వి.పాపారావు, పి.సూర్యకుమారి ఘటనా స్థలానికి వచ్చారు. కారులో నుంచి మూడు మృతదేహాలను బయటికి తీశారు. అయితే కారు పైభాగాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి డ్రైవర్ మృతదేహాన్ని బయటికి తీయాల్సి వచ్చింది. అనంతరం నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద జాతీయరహదారి రక్తమయమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు.

ఒంటరి ఇల్లు, మహిళలే టార్గెట్

(ఐదో పేజీ తరువాయి)

చేసినట్టు గుర్తించాం. ఆ ముగ్గురినీ అరెస్టు చేశాం. చోరీ చేసిన నగదు, బంగా రు ఆభరణాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నా మ'ని ఎస్పీ తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను ప్రశంసించారు.

గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలి

'జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టాలి. మహిళలు, చిన్నారుల వేధింపుల కేసుల దర్యాప్తు వేగంగా పూర్తిచేయాల'ని ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ప్రజా ఫిర్యాదులు, ఎన్డీపీఎస్ మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ 'నిశితమైన కేసుల్లో సాక్ష్యాధారాలతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. గ్రామ సందర్శన చేసి.. ప్రజల సమస్యలు తెలుసుకోవాలి. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి. మాదకద్రవ్యాలు వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల'ని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకా ఆనంద్, అప్పారావు, రాజశేఖర్, ప్రసాదరావు, ఏవో గోపీనాథ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో పెట్రో కెమికల్స్

(ఐదో పేజీ తరువాయి)

కలుగుతుంది. మూల పేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు ఆరు లేన్ల రహదారి నిర్మిస్తాం. దీనివల్ల పర్యాటకాభివృద్ధితో పాటు, అనుబంధ పరిశ్రమలు ఏర్పడతాయి. రూ.167కోట్లతో నరసన్నపేట నుంచి డీపీఎన్ రోడ్డుతో నౌపడ-వెంకటాపురం రహదారికి అనుసంధానం చేస్తాం. టెక్కలి నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.460 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపుతామ'ని తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులకు ఎవరైనా వేలం వేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

జగన్ పాలనలో అంతా దోపిడీ..

'గత ఐదేళ్లు దోపిడీ పాలన సాగింది. మాజీ సీఎం జగన్ మద్యం వ్యాపారంలో రూ.60వేల కోట్లు దోచుకున్నారు. నాసిరకం మద్యం విక్రయించారు. అలాగే అదానీతో విద్యుత్ ఒప్పందం పేరిట రూ.1,500 కోట్లు దోచేశారు. గుజరాత్‌లో యూనిట్ రూ.2.60 ఉండగా.. మన రాష్ట్రంలో రూ.5.60కు ఒప్పందం కుదుర్చుకుని అక్రమాలకు పాల్పడ్డారు. ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై భారం మోపాల్సి వస్తోంది. ధాన్యం రైతులకు రూ.1600 కోట్ల బకాయిలు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించాం. 'అమ్మఒడి', రైతుభరోసా పథకం కింద నిధు లు త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామ'ని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు, మాజీ ఎంపీపీ ధర్మార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛను పంపిణీ



సిమ్మన్నకు పింఛను అందజేస్తున్న మౌనికారెడ్డి

గార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒక రోజు ముందుగానే శనివారం పంపిణీ చేశారు. కె.సైరిగాంకి చెందిన పోలాకి సిమ్మన్న అనే మహిళ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్ మౌనికారెడ్డి రిమ్స్‌కు వెళ్లి పింఛను అందజేశారు.

అదనపు వేళలు.. ఆటపాటలు

కోటబొమ్మాళి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పని వేళలను సాయంత్రం 5 గంటల వరకు పెంచితే ఎలా ఉంటుందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పని వేళలకు సంబంధించి మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. నవంబరు 22 నుంచి 30 వరకు దీన్ని అమలు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లల్లో చురుకుదనం నింపే సహ పాఠ్య అంశాల కోసం శనివారం అదనపు సమయాన్ని వెచ్చించారు. ఆటలు, పాటలు, చిత్రలేఖనం, ప్రాజెక్టులు వంటి ప్రక్రియల అభివృద్ధికి అదనపు వేళలు సాయపడినట్లు ఉపాధ్యాయుడు షన్ముఖరావు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు ఉండడం చలి కాలంలో దూర ప్రాంత విద్యార్థులకు ఇబ్బందే. అయినా అదనపు సమయం మంచిదేనని విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. పదితో పాటు అన్ని తరగతులలో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టడానికి ఈ సమయం ఎంతో ఉపయోగ పడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.



విద్యార్థులకు ఆటలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు


ఆమదాలవలస: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


రణస్థలం: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ


ఇచ్ఛాపురం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

సూపర్ సిక్స్ అమలే చంద్రబాబు లక్ష్యం

- ఒక్కరోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణం

ఆమదాలవలస, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. శనివారం తోటాడ గ్రామంలో పింఛన్ల పంపిణీ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ.. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పింఛన్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మండల టీడీపీ నాయకులు మనుమంతు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే రవికుమార్ ఇటీవల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందినవారి కుటుంబాలను శనివారం పరామర్శించారు. సుమారు 35 కుటుబాలను శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరామర్శించారు.

కొత్త పింఛన్లు పంపిణీ

ఇచ్ఛాపురం/కవిటి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సమయంలో ఇచ్చిన హామీమేరకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే కవిటి గ్రామానికి చెందిన కిడ్నీరోగులకు మంజూరైన పింఛన్లు అందించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మాజీ ఎంపీపీ డి.ఢిల్లీరావు, కవిటి నేతలు బి.రమేష్, ఎ.మధు, టి.మోహనరావు, బి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సాధికారితే ప్రభుత్వ ధ్యేయం

రణస్థలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలోని బలహీన వర్గాల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఒక్క రోజు ముందుగానే సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా శనివారం పతివాడ పాలెం గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేత పిసిని జగన్నాథంనాయుడు, పెంటన్నాయుడు, గొర్ల సాయి తదితరులు ఉన్నారు.

మూడు నెలలకోసారి తీసుకోవచ్చు..

కొత్తూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వసపలో లబ్ధిదారులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి పింఛన్ తీసుకొనే విధానాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేదారిపురంలో..

పలాస రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, దీనిలో భాగంగానే ఒకటో తేదీ సెలవు కావడంతో ముందుగానే పెన్షన్ల పంపి జీ చేశామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలంలోని కేదారిపురంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్, టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, ఎంపీడీవో వసంతకుమార్, ఏపీఎం జాంభవతి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పోలాకి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు మబగాం పంచాయతీ పరిధిలోని గజపతినగరం గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల వెంకట రవికుమార్, టీడీపీ నాయకులు ఎంపీ నాయుడు, కాయ రవి, తెలుగు నాగేశ్వరరావు, పావని పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో...

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగర పరిధి రెండో డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జి అక్కేన రాజారావు ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ స్వరూప్, ధర్మారావు, నాని, రమణ, తదితరులు పాల్గొన్నారు. 34వ డివిజన్‌లో పార్టీ ఇన్‌చార్జి చిట్టిబాబు ఆధ్వర్యంలో పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ చేతుల మీదుగా జెండాల వీధిలో గల కిడ్నీ బాధితులకు, మానసిక వికలాంగులకు పింఛన్ అందించారు. అలాగే 39వ డివిజన్, దమ్మలవీధిలో పార్టీ ఇన్‌చార్జి కేశవ రాంబాబు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు.


పలాస రూరల్: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష


కొత్తూరు: పింఛన్ డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


పోలాకి: పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

మతవిశ్వాసుల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

- బ్రదర్ అనిల్‌కుమార్



పొందూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మత విశ్వాసుల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని ప్రముఖ క్రైస్తవ ప్రచారకుడు బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. పొందూరులో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి మతవిశ్వాసాలను గౌరవించడంతో పాటు ఇతర మతాలను కూడా గౌరవించాలని, వారి విశ్వాసాలకు విలువనివ్వాలని కోరారు. మతాల పరంగా ప్రభుత్వం కొన్ని నిబంధనలు, విధానాలను విధిస్తుందని, వాటిని పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అనంతరం సీఎంసీ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో అనిల్ ప్రసంగించారు.

బ్రహ్మోత్సవాలకు చిన్నారులు పయనం


బయలుదేరిన చిన్నారులు పయనం

ఇచ్ఛాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరమల తిరుపతి దేవస్థానం తిరుచనూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనకు స్థానిక వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు మరోసారి చక్కని అవకాశం లభించింది. డిసెంబరు 2, 3 రెండు రోజులపాటు శిల్పారామం వేదికపై 5న అమ్మవారి వాహనసేవలో చిన్నారులు కూచిపూడి నాట్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ మేరకు శనివారం కళాకారులు అంతా పయనమయ్యారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి, నాట్య గురువు శృతి పట్నాయిక్, చిన్నారులు తదితరులు పయనమయ్యారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన కాళీదాస్ సాహు

కవిటి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కాళిదాస్ సాహు జాతీయ స్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం బి.సుమలత తెలిపారు. చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చాడన్నారు. ఈ మేరకు శనివారం కాళిదాస్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.తోటారావును అభినందించారు.

బీఆర్‌ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌కి గుర్తింపు



బీఆర్‌ఏయూ బృందాన్ని అభినందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎచ్చెర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల బృందానికి ఉత్తమ చురుకైన యూనిట్‌గా, ఉత్తమ పీవోగా కె.కరుణానిధికి గుర్తింపు లభించింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం మనాలిలోని అటల్ బిహారీ వాజ్‌పేయి మౌంటైనింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో పది రోజుల పాటు జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సాహస శిబిరంలో పాల్గొన్న వర్సిటీ యూనిట్ బృందం అన్నింటా ప్రతిభ చూపింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ గౌతమ్ఠాకూర్ నుంచి ప్రశంసా పత్రాన్ని, షీల్డ్‌ను యూనిట్ సభ్యులు శనివారం అందుకున్నారు. బీఆర్‌ఏయూ నుంచి ఎనిమిది మంది, సూర్యతేజ డిగ్రీ కళాశాల (పలాస)కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ బృందంలో పాల్గొన్నారు. శనివారం వీరంతా ఎన్‌ఎస్‌ఎస్ పీవో కరుణానిధి ఆధ్వర్యంలో నూఢిల్లీలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలుసుకున్నారు. కాగా వర్సిటీ వీసీ కేఆర్ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డి.వనజ తదితరులు ఈ బృందానికి అభినందనలు తెలిపారు.

ఇంటర్వ్యూ

ఇంటింటా పశుగణన

- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సురేష్‌కుమార్



ఎచ్చెర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో ఇంటింటా పశుగణన చేపడుతున్నట్టు ఎస్‌ఎం పురం ప్రభుత్వ పశువైద్య కేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జి.సురేష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన మాటల్లో..

ప్ర: పశు గణన ఎలా చేపడుతున్నారు?

జ: ప్రతి గ్రామంలో ఇంటింటా పశు గణన సర్వే చేస్తున్నారు. గత నెల 25న ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుంది.

ప్ర: ఇంటింటా సర్వే ఎలా గుర్తిస్తారు?

జ: పశుగణన జరిగిన ప్రతి ఇంటి తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు అతికిస్తున్నాం.

ప్ర: వివరాల సేకరణ ఎలా ఉంటుంది?

జ: పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్ల తదితర 16 రకాల వివరాలను సేకరిస్తున్నాం. దీనివల్ల పశువులు, కోళ్ల తదితర వాటి అభివృద్ధి ఏ మేరకు జరుగుతుందో తెలుసుకోవచ్చు.

ప్ర: ఈ గణన వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?

జ: పశుసంవర్థక రంగంపై ఆధారపడి జీవించే కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.

ప్ర: పశు గణన ఎంతవరకు పూర్తయింది?

జ: మండలంలో మొత్తం 22,475 హౌస్ హోల్డ్స్‌కు గాను ఇప్పటి వరకు 6,436 హోల్డ్స్ వివరాలు సేకరించాం.

ప్రతిభ చూపిన వారికి అభినందన


ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో గంజాయి పట్టివేత, ప్రాపర్టీ నేరాలు చేదనలోను, ముద్దాయిలకు శిక్షలు పడడం తదితర అంశాలపై చాకచక్యంగా వ్యవహరించిన వారికి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మొత్తానికి 88 మందికి ప్రశంసా ప్రతాలతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. అలాగే పలువురు పోలీసు అధికారులు సిబ్బందికి గుడ్ సర్వీస్ రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాలని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద్, పాపారావు, రాజశేఖర్, ప్రసాదరావు, సీఐలు అవతారం, ఇమ్మాన్యూల్ రాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమి కొడదాం..


ఇచ్ఛాపురం: ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ-ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొడదామని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయిక్ అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులచే ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల మైదానంలో విద్యార్థులచే ఎయిడ్స్ గుర్తు ఆకారంలో కూర్చొని అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, పద్మావతి, అమిత, చంద్రవదన్ తదితరులు పాల్గొన్నారు.

- సోంపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, అధ్యాపకులు పి.రజనీకుమారి, ఎ.రామినాయుడు, ఎం.ప్రసాద్. టి.యుగంధర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, బెహారా మనోవికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు, రాజాం మండలం పొగిరి వద్దనున్న కుష్ఠువ్యాధి నివారణ కేంద్రంలో 200 దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బ్యాంకు రీజనల్ హెడ్ తిలక్, ఎంపవర్ హెర్ అండ్ హిమ్ కమిటీ సభ్యులు పి.రవి, ప్రసాద్, రేష్మ, వైకుంఠరావు, ఇందిరా, సంతోషి, సిబ్బంది పాల్గొన్నారు.

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్స వేడుకలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ ఏడీ కవిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు డచ్ భవన మైదానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

రెండు మాధ్యమాల్లో పరీక్షలు నిర్వహించాలి

పొందూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రశన్న, పేడాడ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో 9,10వ తరగతుల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాయవచ్చని నిర్ణయించడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, అందువల్ల రెండు మాధ్యమాల్లో పరీక్షలు నిర్వహించాలని కోరారు.

రైతు సేవలో కూటమి ప్రభుత్వం

కవిటి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులకు కావల్సిన సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ప్రగడపుట్టుగలో శనివారం పరికరాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమని యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది ఎం.రాంబాబు కోరారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు వల్ల కలిగి అనార్థాలపై నెల రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి, హైకోర్టు న్యాయవాది ఎస్.విశ్వనాథం చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరించారు. న్యాయవాదులు విశ్వనాథం, డి.కృష్ణమూర్తిరెడ్డి, నాగరాజు పాత్రో, ఐసీడీఎస్ పీవో నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మతసామరస్యాన్ని కాపాడు కోవాలని సాహితీప్రియులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గురజాడ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసరావు ఉన్నారు.

అవగాహన లేక.. చైతన్యం కల్పించక

● జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తున్న వైనం
● నేడు ఎయిడ్స్ నివారణ దినం



టెక్కలి/హిరమండలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ప్రధానంగా ప్రజల్లో అవగాహన లేకపోవడంతోపాటు అధికారులు చైతన్యం కల్పించకపోవడంతో పలువురు ఎయిడ్స్ బారిన పడుతున్నారు. పులిరాజాకు ఎయిడ్స్ వచ్చిందని ఒకప్పుడు టీవీలు, హోర్డింగ్‌లు ద్వారా విస్తృత ప్రచారం చేసేవారు. దీంతోపాటు ఎయిడ్స్ నిర్మూలనపై అనేకరకాల కార్యక్రమాలు నిర్వహించేవారు.గతంలో జాతీయరహదారికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు, లారీ డ్రైవర్లు, వలసదారుల్లో కనిపించేది. ప్రస్తుతం తీరప్రాంతంలో, ఎంఎస్ఎం (హిజ్రాలు)ల్లో ఎయిడ్స్ బాధితులు ఉంటున్నారు. ఆదివారం ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని కథనం..

ఎయిడ్స్ గుర్తించడం ఇలా..

దీర్ఘకాలికంగా జ్వరం, దగ్గు, జలుబు, విరోచనాలు, బరువు తగ్గడం తదితర కారణాలు ఉన్నవారికి, టీబీ, గర్భిణీ, సర్జరీ కేసులకు సంబంధించి ఆసుపత్రుల్లో ఈ తరహా పరీక్షలు నిర్వహిస్తారు. హెచ్ఐవీ పాజిటివ్ అని గుర్తించేందుకు మొదటగా కూంబ్ ఎయిడ్స్, స్టాండర్డ్ క్యూ ఎయిడ్స్ స్కాన్ వంటి పరీక్షలు ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్(ఐసీటీసీ)లో నిర్వహిస్తారు. ఆ పరీక్షల్లో పాజిటివ్ అని తేలితే వారికి దగ్గర్లో గల ఏఆర్‌టీ సెంటర్లకు పంపిస్తారు. ప్రతి ఆరు నెలలకు సీడీఫోర్ పరీక్ష, ప్రతిఏడాదికి ఒకసారి వైరల్ లోడ్ పరీక్షలు చేస్తుంటారు. హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు యాంటీ రిట్రో వైరల్ మందుల కిట్లు ఉచితంగా సరఫరా చేస్తారు. జిల్లాలో ఏపీ శాక్ లెక్కలు ప్రకారం సుమారు 17,776 మంది హెచ్ఐవీ పాజిటివ్ రోగులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పిల్లలు, మహిళలు, పురుషులు, ఎంఎస్ఎం (హిజ్రా) లు ఉండడం విశేషం. హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు టెక్కలి ఏఆర్‌టీ సెంటర్ ద్వారా 1,800మందికి, శ్రీకాకుళం ఏఆర్‌టీ సెంటర్ ద్వారా సుమారు ఏడువేల మందికి మందులను పంపిణీ చేస్తున్నారు. ఐసీటీసీ సెంటర్ల పరిధిలో కౌన్సి లర్, ల్యాబ్‌టెక్నీషియన్, ఏఆర్‌టీ సెంటర్ పరిధిలో కౌన్సిలర్, స్టాఫ్ నర్సుతో పాటు వైద్య నిపుణులుఅవసరమైన సలహాలు ఇవ్వడంతో పాటు, మందులు పంపిణీ చేస్తుంటారు.

ఐసీటీసీ కేంద్రంలో ఫార్మాసిస్ట్ పోస్టు ఖాళీ

టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గల ఐసీటీసీ సెంటర్‌లో ఫార్మాసిస్ట్‌తోపాటు డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన లక్షలాది రూపాయలతో కొనుగోలుచేసిన కంప్యూటర్, ఇతర సాంకే తిక పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పోస్టులు భర్తీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ తాత్సారం ప్రదర్శిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ జిల్లాలో ఎయిడ్స్ కార్యకలాపాల పరిస్థితి

జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ రోగుల సంఖ్య :	17,776 మంది
గర్భిణుల్లో హెచ్ఐవీ పాజిటివ్ సంఖ్య :	22 మంది
ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా మందులు వాడుతున్న వారి సంఖ్య :	9,028మంది
జిల్లాలో ఐసీటీసీ సెంటర్లు :	ఇచ్ఛాపురం, సోంపేట, బారువ, పలాస, కోటబొమ్మాళి, పాతపట్నం, నరసన్నపేట, బుడితి, రణస్థలం, కొత్తూరు
ఏఆర్‌టీ సెంటర్లు :	టెక్కలి, శ్రీకాకుళం
జిల్లాలో ఎయిడ్స్ పెన్షన్లు పొందుతున్న వారి సంఖ్య :	2,510 మంది
హైరిస్క్ ఉన్న ప్రాంతాలు :	తీరప్రాంతం, వలసదారులు

బాధితులకు పింఛన్లు

జిల్లాలో ఎయిడ్స్ రోగులకు సంబంధించి 2,510మందికి గాను నెలకు రూ.4వేలు చొప్పున పెన్షన్లు అందజేస్తున్నారు. ఇంకా అర్హత గల ఎయిడ్స్ రోగులు సుమారు నాలుగువేల మంది వరకు పెన్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. హెచ్ఐవీ పాజిటివ్ రోగులకు పెన్షన్ ఇవ్వడం వల్ల వలసలు నివారించవచ్చు. మందులు సక్రమంగా వాడడం ద్వారా న్యూట్రీషియన్ సపోర్టు వారికి లభిస్తుంది.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో శనివారం ఐదుగురు మృతిచెందారు.జి.సిగడాం మండలంలోని సంతవురిటి కూడలి, రణస్థలం మండలంలోని పైడిభీమవరం వద్ద గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మహిళ, వృద్ధుడు మృతిచెందారు. నరసన్నపేట మండలంలోని చెన్నాపురానికి చెందిన మహిళ, గార మండలంలోని నిజామాబాద్‌కు చెందిన యువకుడు, శ్రీకాకుళానికి చెందిన వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతిచెందారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..



సరోజిని(ఫైల్)

జి.సిగడాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సంతవురిటి కూడలి వద్ద శనివారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా రాజాం పట్టణ పరిధి మాదిగవీధికి చెందిన పలుసపల్లి సరోజిని(48) మతిస్థిమితం లేక శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందింది. ఈమెకు భర్త ఏసు, కొడుకు నాగబాబు, కూతురు సుజాత ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

పైడిభీమవరం సమీపంలో వృద్ధుడు..

రణస్థలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పైడిభీమవరం సమీపాన శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియన వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 70 ఏళ్ల వయసు గల వృద్ధుడు శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోన్నట్టు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

చెన్నాపురంలో మహిళ..

నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన రావాడ చిన్నమ్ముడు (75) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు. హెచ్‌సీ కథనం మేరకు.. చిన్నమ్ముడు గతనెల 28న చుట్ట కాల్చుతున్న సమయంలో ఆమె చీరకు నిప్పు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. అదేరోజు నరసన్నపేట వందపడకల ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రిమ్స్‌కు తరలించారని అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమారుడు సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. .

నిజామాబాద్‌లో యువకుడు..



మహేష్(ఫైల్)

గార నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ గ్రామంలో గతనెల 19న విద్యుత్ షాక్‌కు గురైన బెండి మహేష్ (23) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయినట్టు ఎస్ఐ ఆర్.జనార్దన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం మండలం బెండివానిపేటకు చెందిన మహేష్ నిజామాబాద్ గ్రామంలో విద్యుత్ పనుల్లో భాగంగా స్తంభంపై షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చీరకు నిప్పు అంటుకుని వృద్ధురాలు ..

శ్రీకాకుళం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన ఎం.సీతారత్నం (81) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గతనెల 27న పూజ చేస్తున్న సమయంలో కర్పూరం బిల్ల వెలిగించి హారతి ఇస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి విశాఖ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు శ్రీకాకుళం పోలీసులు తెలియజేశారు.

ఒడిశా మద్యం స్వాధీనం

పాతపట్నం నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశాఖపట్నానికి చెందిన ఓ వ్యక్తి నుంచి శనివారం నాలుగు ఒడిశా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈమేరకు నిందితుడిపై ఏఎస్ఐ కృష్ణారావు కేసు నమోదుచేశారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

శ్రీకాకుళం క్రైం,నవంబరు 30:నగరంలోని ఆదివారంపేటకు చెందిన తల్లి, కూతురు అదృశ్యమైనట్టు శ్రీకాకుళం పోలీసులకు భర్త యాదం భాస్కరరావు శనివారం ఫిర్యాదుచేశారు. నాలుగు రోజుల కిందట అతని భార్య సంధ్యారాణి ఏమి పనిచేయకుండా మొబైల్‌కే అంకితమవుతుందని మందలించానని, అప్పటినుంచి కనిపించలేదని పోలీసులకు అతడు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొందూరులో కళాంజలి థియేటర్ సీజ్

పొందూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):పొందూరులో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కళాంజలి థియేటర్‌ను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. థియేటర్ యాజమాన్యం 2023-25 సంవత్సరానికి ఫారం-బీ లైసెన్స్‌ను రెన్యువల్ చేయాల్సిందిగా ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో అధికారులు రెన్యువల్ చేయలేదు. దీనిపై థియేటర్ యాజమాన్యానికి శ్రీకాకుళం ఆర్డీవో నోటీసులు జారీ చేయడంతోపాటు తక్షణమే సీజ్ చేయాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో థియేటర్ యాజమాన్యానికి నోటీసులు అందించి శనివారం రాత్రి సీజ్ చేశారు. దీంతో థియేటర్ మూతబడింది. కాగా గతంలోను ఈ థియేటర్ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నట్టు పొందూరు పట్టణానికి చెందిన బి.దామోదరరావు కోర్టును ఆశ్రయించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసుల తనిఖీలు

టెక్కలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు రైల్వేస్టేషన్‌ను శనివారం కెనాన్ డాగ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లో జల్లెడపట్టాయి. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు రవాణా జరుగుతున్నాయన్న అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. అలాగే టెక్కలిలో పలు దుకాణాల్లో కూడా కెనాన్ డాగ్‌తో పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎస్ఐ రాముతోపాటు ప్రత్యేక పోలీస్ బృందం పాల్గొంది.

నీటి సంఘాల ఎన్నికలు నిలిపివేయాలి

ఎల్.ఎన్.పేట,నవంబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలో వంశధారనదికుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలకు సంబంధించిన నీటి సంఘాల ఎన్నికలు నిలిపివేయాలని కోవిలాం గ్రామ రైతులు ఎస్.నారాయణరావు, కె. చిరంజీవి కోరారు. ఈ మేరకు నీటిసంఘాల ఓటర్ల జాబితా తప్పులతో ఉండడంపై శనివారం ఆర్ఐ ఎస్. గవరయ్యకు వినతిపత్రం అందజేశారు. జాబితా సరిచేసినంత వరకు ఎన్నికలను వాయిదావేయాలని కోరారు. కోవిలాం రెవెన్యూ పరిధిలో సుమారు 200 ఎకరాలు ఉండగా దీనిని 5ఎల్,7ఎల్ కాలువలకు ఆయకట్టుగామార్చి ఓటర్ల జాబితాలో తప్పులుతడకగా సృష్టించారని తెలిపారు.

హిరమండలంలో న్యాయ విజ్ఞాన సదస్సు

హిరమండలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):మహిళలు వారికి రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కలిగిఉండాలని కొత్తూరు మండల న్యాయసేవా సంస్థల అధ్యక్షులు, జూనియర్ సివిల్ న్యాయాధికారి కందికట్ల రాణి తెలిపారు. శనివారం హిరమండలం మండలపరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వరకట్న, ఒంటరి మహిళలకు జరుగుతున్న వేధింపులపై కోర్టును ఏవిధంగా ఆశ్రయించాలో వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరిప్రియ, సౌజన్య, ఎంపీడీవో కాశీ ప్రసాదరావు, తహసీల్దారు హనుమంతురావు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

గుజరాతీపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయ నూతన క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసెక్యూషన్స్ పి.మధుసూధనరావు అన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని కోర్టుల్లో గల రెగ్యూలర్, టెన్యూర్ పీపీలు, పోలీస్ లైజన్ ఆఫీసర్లతో సమీక్షించారు. నూతన చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని, న్యాయ వ్యవస్థకు, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంధానకర్తలుగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో పి.రఘురామ్, వాన కృష్ణచంద్, సీహెచ్ సత్యనారాయణ, ఎల్.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బోరుభద్ర పీహెచ్‌సీ తనిఖీ

● వైద్యాధికారిపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం

సంతబొమ్మాళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి దేవివనిత విధులకు డుమ్మా కొట్టడంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహంవ్యక్తం చేశారు. శనివారం ఉదయం పది గంటలకు మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో పీహెచ్‌సీనని తనిఖీచేశారు. దేవివనిత విధులకు అప్పటికి రాకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. వైద్యాధికారి ఎప్పుడూ విధులకు హాజరుకారని గ్రామస్థులు మంత్రికి ఫిర్యాదు చేశారు. పాముకాటు వ్యాక్సిన్‌లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తీరప్రాంత గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందించాలని గతంలో తాను ఈ పీహెచ్‌సీని 24 గంటలు పీహెచ్‌సీగా మార్చానని, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ డిప్యూటేషన్ మీద వేరేచోట పనిచేయడం గుర్తించి మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆర్‌డీని ఆదేశించారు. అనంతరం బోరుభద్రలో టెక్కలి డిపోకు చెందిన ఆరు కొత్త బస్సులను ప్రారంభించి అందులో సంతబొమ్మాళి వరకు కలెక్టర్‌తో కలిసి ప్రయాణించారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్నివిధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. శనివారం రిట్టపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం అధికారుల సహాయంతో ప్రభుత్వమే కోనుగోలు చేసి త్వరగా రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఎస్‌డీ మధు, రాష్ట్రట్రేడ్‌కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబురావు, అగ్నికులక్షత్రి కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షులు సూరాడ మోహనరావు, తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, డీటీ మురళీధర్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి విఠల్, కర్నిరమణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఓపీ పెంచాలి: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలను అందించే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓపీ మరింత పెరిగేందుకు వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం మాకివలస పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అయ్యేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. పాముకాటు, కుక్కకాటు మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణ, శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు. కాగా కిల్లాంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాల్లో పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్ల వాకౌట్

పలాస, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల శంకుస్థాపనకు తమకు పిలవలేదని, అజెండాలో కూడా తమకు తెలియకుండానే వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానాలకు ప్రతిపాదించడానికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు వైసీపీ సభ్యులు ప్రకటించారు. ఛైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జరిగింది. తొలుత వైసీపీ కౌన్సిలర్లు కర్రి మాధవరావు, గుజ్జు జోగారావు, దుర్గాశంకర్‌పండా, పప్పల ప్రసాదరావు, బెల్లాల శ్రీనివాసరావు, శిష్టు బృందావతి, బోర చంద్రకళ 15వ ఆర్థిక సంఘ నిధులపై కౌన్సిలర్లకు తెలియకుండా పనులకు ప్రతిపాదనలపై ప్రశ్నించారు. ఛైర్మన్ బళ్ల గిరిబాబు మాట్లాడుతూ మరోసారి కౌన్సిలర్లకు అవమానం జరిగితే సభకు పూర్తిగా తాను రానని స్పష్టం చేశారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రామారావు, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, డిక్కల ఆనంద్, జోగ త్రివేణి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా



టీడీపీ సభ్యత్వంపై అవగాహన కల్పిస్తున్న పుచ్చ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూండి, పాతటెక్కలి, సుంకజగన్నాథపురం, కొమరల్తాడ, దేవునల్తాడ, హుకుంపేట రెయ్యిపాడు, అమలపాడు, పెద్దమురహరిపురం, ఉద్దానం గోపినాథపురం, ఉద్దాన రామకృష్ణాపురంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు టీడీపీ సభ్యత్వ నమోదుపై శనివారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన వారికి రూ. ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయం ఉంటుందని తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో సభ్యులుగా చేరి కంచుకోటగా మరోసారి రుజువుచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ, మాజీ సర్పంచ్‌లు దున్న షణ్ముఖరావు, చింతనారాయణ, గోవిందుపాపారావు పాల్గొన్నారు.

లోటుపాట్ల గుర్తింపునకు సామాజిక తనిఖీ: పీడీ

మందస, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలో అవకతవకలు, లోటుపాట్లు గుర్తించేందుకే ప్రతిఏడాది సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ బి.సుధాకర్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి 24 మార్చి వరకు మండలంలో 41 పంచాయతీల్లో చేపట్టిన 3,553 అభివృద్ధి పనులకు గాను డీఆర్‌పీల నివేదిక చదివి వినిపించారు. వేతనాలు రూ.2కోట్ల 76 లక్షలు, మెటీరియల్ రూ.8కోట్ల 72క్షల 95 వేలు ఖర్చు జరిగినట్లు తెలిపారు. కాగా మందస ఫీల్డ్‌అసిస్టెంట్ గణపతిపై టీడీపీ మండలాధ్యక్షుడు భావన దుర్యోధన, మరికొంతమంది టీడీపీ నాయకులు డ్వామా పీడీ బి.సుధాకర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఉపాధికూలీల నుంచి ప్రతి వారం రూ.100 చొప్పున అక్రమ వసూలుచేశారని, కొంతమంది ఇవ్వడం లేదని పని కల్పించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్ఓ స్వరూపారాణి ఏపీడీడబ్ల్యు రాధా, శ్రీనివాసరెడ్డి, మేనేజరు శ్రావణ్, ఎస్ఆర్‌డబ్ల్యు పున్నపునాయుడు, తిరుపతి, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఎంపీపీ దానయ్య, ఏపీవో హరికృష్ణ పాల్గొన్నారు.

ఆధార్‌ను ఎన్‌పీసీఐతో లింక్ చేసుకోండి

కొత్తూరు, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీసీఐతో ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేయించాలని హరీష్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని అల్తి పంచాయతీ వెలుగు అసోసియేన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, ఆదివాసీ హక్కులపై సచివాలయ సిబ్బందితో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ, అ గ్రికల్చర్ అసిస్టెంట్లు చంటి బాబు, నవీన్, ఎస్.ఎలిస్వేని, సర్పంచ్ ఎస్.విజయకుమారి, ఎస్.ఆఫీస్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులోకి సీటీస్కాన్ సేవలు

టెక్కలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి సీటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత నెల 26 నుంచి శుక్రవారం వరకు సీటీస్కాన్ మొరాయించిన విషయం విదితమే. దీంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. సీటీస్కాన్‌కు సంబంధించి ట్యూబ్‌పరికరం పాడవడంతో సాంకేతిక అధికారులు మరమ్మతు చేసి శనివారం నుంచి రోగులకు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

నేడు అఖండ హరినామ సంకీర్తన

నందిగాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మిడిజోలలో ఆదివారం అఖండ హరినామసంకీర్తన రామాలయ భజన బృందం, హరే రామ.. హరే కృష్ణ భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసోత్సవాలు పూర్తికావడంతో ఉదయం విశేషపూజలతోపాటు అఖండ హరేరామ సంకీర్తన, ఆధ్యాత్మిక ఉపన్యాసం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి మహరాజ్ హాజరుకానున్నారని తెలిపారు.

నేడు ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

జలుమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) స్థానిక ప్రభుత్వ బాలికోన్నతపాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నతపాఠశాలల హెచ్ఎంలు వారి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్ జైలు పరిశీలన

నరసన్నపేట,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సబ్‌జైలును సివిల్‌కోర్టు న్యాయాధికారి హరిప్రియ శనివారం పరిశీలించారు. సబ్‌జైలులో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ముద్దాయిలకు సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ గొండు సత్యనారాయణ, జి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

నందిగాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది చేపట్టనున్న జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టాలని జిల్లా దళిత మహాసభ అధ్యక్షులు బోకర నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం నందిగాంలో విలేకరులతో మాట్లాడుతూ 1951 తర్వాత ఎస్సీ ఎస్టీ జనాభా సమాచారం సేకరించినా, అది చట్టసభల్లో ఎస్సీ ఎస్టీ స్థానాలు నిర్ణయించేందుకు ఉపయోగించారని తెలిపారు. రానున్న జనగణన, కులగణన ప్రక్రియ పక్కాగా చేపట్టి బీసీలకు పూర్తి న్యాయం అందించాలని కోరారు.

బాధితునికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దానం గోపినాథపురానికి చెందిన కర్ని ఈశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఉద్దాన హెల్పింగ్ సొసైటీ అండగా నిలిచింది. ఈ మేరకు శనివారం ఆయనకు ఆ సంస్థ ప్రతినిధులు రూ. 28 వేలు అందజేశారు.కార్యక్రమంలో ప్రతినిధులు కర్నిశ్రీను, శాంతి, కమల పాల్గొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి

టెక్కలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవరచుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. శనివారంకె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ శాంతికుమార్, డాక్టర్ జయకుమార్, డాక్టర్ బలరాం, పిరియా రమేష్ పాల్గొన్నారు.

నరసన్నపేటలో లక్ష దీపారాధన



వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపార్చన నిర్వహిస్తున్న మహిళలు

నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో కార్తీక మాసం ఆఖరి శనివారం పురష్కరించుకుని లక్షదీపారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గశిర మాసానికి స్వాగతం పలుకుతూ వైకుంఠనాథుడుకు ప్రత్యేక పూజలుచేశారు. అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

సంగీత నీరాజన కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి,నవంబరు30(ఆంధ్రజ్యోతి):అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించనున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాల ఏర్పాట్లను కేంద్ర పర్యాటకాధికారి చందర్‌నాయక్ పరిశీలించారు. అనివెట్టి మండపంలో ఏర్పాట్లను మునిసిపల్ కమిషనర్, ఆర్డీవో, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఆరాతీశారు.

మత్తు పదార్థాలను నిర్మూలించాలి



కాశీబుగ్గలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంఘాల నాయకులు

కాశీబుగ్గ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు నిర్మూలించాలని వక్తలు పిలుపునిచ్చారు. పలాసలో మాదక ద్రవ్యాల నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఛైర్మన్ వజ్జ బాబురావు, టీడీపీ పట్టణాధ్యక్షు డు బడ్డ నాగరాజు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు గోపాల్, కాంతమ్మ, వేణుగోపాల్, గణపతి పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

ఇచ్ఛాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సురంగి రాజా మైదానం నుంచి బాహుదా శ్మశాన వాటిక వరకు విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి పూట రాకపోకలకు ఇబ్బంది పడుతుండడంతో దీపాలు ఏర్పాటు చేయాలని వైస్ ఛైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కోరారు. శనివారం కౌన్సిల్ హాల్‌లో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన 11 అంశాలపై చర్చించి, 10అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాత బస్టాండ్ వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ మరమ్మతులకు రూ3.50 లక్షలు కేటాయించగా, కౌన్సిలర్లు అభ్యంతరం తెలపడంతో ఈ అంశాన్ని రద్దు చేశారు. విద్యుత్‌శాఖ ఏడీ గోవిందరావు, కమిషనర్ ఎన్.రమేష్, ఛైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.